సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024





**సోమశిలలో 17.745 టీఎంసీలు**

సోమశిల: జలాశయంలో సోమవారం సాయంత్రానికి 17.745 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,650 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రాములు) | రూ.64,160 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) | రూ.5,762 |
| 3 శాతం జీఎస్టీతో.. | రూ.5,935 |
| నవర (8 గ్రా) | రూ.47,480 |

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
33.5 /25.6

సోమవారం గాలిలో తేమ 64 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు నిలకడగా ఉన్నాయి. మంగళవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

## న్యూస్‌రీల్

### సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి



బాధితురాలి సమస్యను వింటున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): సైబర్ మోసాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి సూచించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 104 మంది వచ్చి తమ సమస్యలపై ఎస్పీకి ఫిర్యాదులు అందజేశారు. ఆన్‌లైన్ ట్రేడింగ్, ప్రైవేటు చిట్స్, బ్యాంక్ రుణాలు, ఆస్తికోసం పిల్లలు ఇబ్బందులు పెడుతున్నారని, వ్యక్తిగత ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పెడతామని బెదిరిస్తున్నారని.. ఇలా పలు ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించిన ఎస్పీ నిర్ణీత గడువులోగా సమస్యను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆయా ప్రాంత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సౌజన్య, ప్రసాద్, నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సీటు సాధించలేకపోయా క్షమించండి: మనుక్రాంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మనుక్రాంత్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు సిటీలో జనసేన పార్టీ తరఫున సీటు సాధించలేకపోయానని కార్యకర్తలు, ప్రజలు తనను క్షమించాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి కోరారు. జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లు రెండు రోజుల క్రితం 6 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినా అందులో జనసేనకు ఒక్క సీటు కూడా లేకపోవడం బాధ కల్గించిందన్నారు. రెండో జాబితాలోనైనా జిల్లాకు సీటు వచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

### నేటి నుంచి టెట్

నెల్లూరు(టౌన్): టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ మంగళవారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు జరగనుంది. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 6,363 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. జిల్లాలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల, పొట్టేపాళెం సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్, కావలిలోని పీబీఆర్ విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాల, ఆర్‌ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహించనున్నారు.

# లిఫ్ట్ పనుల్లో నిధులు మెక్కేశారు

**టీడీపీ హయాంలో రూ.కోట్లలో అవినీతి**

- కండలేరు ఎత్తిపోతలలో అవకతవకలు
- రెండు మోటార్లు ఒకే సమయంలో వేయలేని పరిస్థితి
- రెండూ ఆన్ చేస్తే ఒకటి ట్రిప్ అవుతున్న వైనం
- గతంలో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు రూ.62 కోట్లు ఖర్చు చేసిన టీడీపీ ప్రభుత్వం
- వాటిలో ఒకటి అసెంబుల్డ్ మోటారని తేల్చిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

**టీడీపీ హయాంలో కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన కండలేరు ఎత్తిపోతల పథకం నిర్మాణంలో లొసుగులు చోటు చేసుకోవడంతో రైతులకు పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి రావడం లేదు. పనులు నాణ్యతగా చేయకపోవడం వల్ల పథకం సమర్థవంతంగా పనిచేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఫలితంగా సాగునీరు అవసరమైన సమయంలో ఎత్తిపోతల ద్వారా నీటిని తోడి కాలువలోకి పంపే ప్రక్రియను ఉపయోగించేందుకు అధికారులకు ఇబ్బందిగా మారింది.**

పొదలకూరు: గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్‌కు బిగించిన హెవీ మోటార్లలో అవినీతి జరిగిందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇదే అంశంపై మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎన్నో పర్యాయాలు వాస్తవాలను రైతులకు వివరించారు. ఎత్తిపోతల్లో జరిగిన అవకతవకల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకే సమయంలో రెండు మోటార్లను ఉపయోగించి వేగంగా సాగునీటిని కాలువకు పంపింగ్ చేసేందుకు వీలుపడడం లేదు. ఫలితంగా అధికారులు ఒక మోటారు వినియోగించిన సమయంలో మరో మోటారును నిలిపివేస్తున్నారు. రెండూ ఒకే సమయంలో వినియోగిస్తే పక్కనే ఉన్న మినీ విద్యుత్ సబ్‌స్టేషన్లో విద్యుత్ ట్రిప్ అవుతోంది.

**ఎత్తిపోతలకు రూ.62 కోట్లు**

ఎత్తిపోతల పథకం నిర్మాణానికి టీడీపీ హయాంలో సోమిరెడ్డి వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్న సమయంలో 2017లో రూ.62 కోట్లు వెచ్చించారు. వాస్తవానికి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.30 కోట్లు కేటాయింపులు జరిగినా సింగిల్ టెండరు పడడం వల్ల అప్పట్లో రద్దు చేశారు. తర్వాత వైఎస్సార్ మరణం, ఆపై వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర విభజన సమయంలో దిగిపోతూ పథకానికి పాలనాపరమైన ఆమోదం తెలిపింది. నూతన రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడి ఎత్తిపోతలకు నిధులు కేటాయించినా పనులు నాసిరకంగా జరగడం వల్ల నిధులు దుర్వినియోగం అయినట్టుగా అప్పట్లోనే పెద్ద దుమారం రేగింది. రెండు హెవీ మోటార్లు (ఒక్కొక్కటి 2,050 హెచ్‌పీ) ద్వారా 260 క్యూసెక్కుల సాగునీటిని పంపింగ్ చేయాల్సి ఉంది. అయితే ఒక్కొక్క మోటారే వంతుల వారీగా వినియోగించడం వల్ల 130 క్యూసెక్కుల నీటినే విడుదల చేయాల్సి వస్తోంది. ఇటీవల వరిపంటలను కాపాడేందుకు లిఫ్ట్‌ను ఉపయోగించి ఇదే పద్ధతిలో తెలుగుగంగ అధికారులు 20 రోజుల పాటు నీటిని కాలువకు విడుదల చేయాల్సి వచ్చింది. రెండు మోటార్లు ఒకే సమయంలో ఉపయోగించి ఉంటే 10 రోజుల్లో సాగునీటిని కాలువకు విడుదల చేస్తే సరిపోయేదని రైతులు పేర్కొన్నారు. రెండు మోటార్లలో ఒకటి కంపెనీది కాదని అసెంబుల్డ్ మోటారని అప్పట్లో ప్రతిపక్ష ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోరాటమే చేశారు. అయితే అప్పటి టీడీపీ పాలకులు పట్టించుకోకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది.



ఎడమ కాలువలోకి పంపింగ్ చేస్తున్న సాగునీరు



ఎత్తిపోతల పంపింగ్ హౌస్‌లోని విద్యుత్ మోటార్లు

**మోటార్ల ఏర్పాటులో అవకతవకలు**



లిఫ్ట్‌కు బిగించిన మోటార్లలో అవకతవకలు జరిగిన మాట వాస్తవమే. లేకపోతే రెండు మోటార్లు ఒకే సమయంలో ఉపయోగించేందుకు అధికారులు ఎందుకు ఇబ్బందులు పడుతున్నారు. అప్పట్లో మంత్రి కాకాణి మోటార్ల ఏర్పాటుపై ఉన్నతస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది. ఇపుడు రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– వై.పెంచలరెడ్డి, రైతు, ఏపీబీ చైర్మన్, పులికల్లు

**రెండు మోటార్లు ఉపయోగించలేదు**

ఒకే సమయంలో రెండు మోటార్లు ఉపయోగిస్తే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కనుక ఒక మోటారు ద్వారా 130 క్యూసెక్కులు, తర్వాత మరో మోటారు ద్వారా 130 క్యూసెక్కుల వంతున ఇటీవల కాలువకు నీటిని విడుదల చేయడం జరిగింది. హెవీ మోటార్లు ఒకే సమయంలో వాడితే సాంకేతిక లోపం తలెత్తుతోంది.

– అనిల్‌కుమార్‌రెడ్డి, ఈఈ, తెలుగుగంగ

# అర్జీలపై ప్రత్యేక దృష్టి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్ మర్మత్

- ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్ మర్మత్

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్నకు చెబుదాం అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో డీఆర్‌ఓ లవన్న, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీపీఓ సుస్మితతో కలసి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఇచ్చిన వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద జిల్లాలో నిర్మిస్తున్న గృహాలలో రూ.30 కోట్ల కుంభకోణం జరిగిందని, దానిపై విచారణ జరపాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ స్పందనలో డీఆర్‌ఓ లవన్నకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్‌యస్ రమేష్‌నాథ్, హౌసింగ్, మెప్మా, ఐసీడీఎస్ పీడీలు నాగరాజు, రవీంద్ర, హేనా సుజన్, బీసీ, ఎస్సీ వెల్ఫేర్ అధికారులు వెంకటయ్య, రమేష్, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

**కోల్డ్ స్టోరేజీలో పొగాకు నిల్వకు అనుమతి తప్పనిసరి**

ఒంగోలు సెంట్రల్: కోల్డ్ స్టోరేజీలలో పొగాకు బేళ్లను నిల్వ చేయాలంటే పొగాకు బోర్డు అనుమతి పత్రం (టి–పత్రం) తప్పనిసరి అని బోర్డు సెక్రటరీ, మేనేజర్ దివి వేణుగోపాల్ అన్నారు. ఒంగోలు బోర్డు కార్యాలయంలో సోమవారం కోల్డ్ స్టోరేజ్ మేనేజర్లతో జరిగిన సమావేశంలో ఈ విషయం తెలిపారు.



# టీడీపీలో సోమిరెడ్డి కరివేపాకేనా!

- తొలి జాబితాలో దక్కని చోటు
- సర్వేపల్లికి ఇతరుల పేర్లు పరిశీలన
- ఆనం, పెళ్లకూరు పేర్లతో ఐవీఆర్ఎస్ సర్వే
- సోమిరెడ్డి రాజకీయ భవితవ్యంపై నీలినీడలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: వెన్నుపోటు రాజకీయాలకు టీడీపీ అధినేత చంద్రబాబు కేరాఫ్ అనేది జగద్విదితమే. ఆ పార్టీ కోసం దశాబ్దాలుగా ఊడిగం చేసినా, చివరికి వారు కరివేపాలుగా మారుతున్నారు. తాజాగా ఆ జాబితాలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేరారనే చర్చ జరుగుతోంది. సర్వేపల్లిలో వరుస ఓటములతో ఇప్పటికే కుంగిపోతున్న ఆయనకు ఈ దఫా అధిష్టానం టికెట్ ఇచ్చే యోచనలో లేనట్లుగా ప్రచారం సాగుతోంది.

**సోమిరెడ్డికి ఓటమి భయం**

మాజీ మంత్రి సోమిరెడ్డికి 2004 ఎన్నికల నుంచి గ్రహబలంతో పాటు జనబలం అనుకూలంగా లేదు. దీంతో వరుసగా ఓటమి పాలవుతున్నాడు. సర్వేపల్లిలోనే 2004, 2009 ఎన్నికల్లో ఆదాల ప్రభాకర్‌రెడ్డి చేతిలో, 2014, 2019 ఎన్నికల్లో కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. 2012లో కోవూరు ఉపఎన్నికల్లో కూడా ఆయన ఓటమి చెందారు.

**కొత్త వ్యక్తుల కోసం అన్వేషణ**

సర్వేపల్లిలో సోమిరెడ్డి ఓటమి మరోసారి ఖాయమన్న సంకేతం పార్టీ అధిష్టానానికి చేరింది. ఇప్పటికే ఆ పార్టీ నేత లోకేశ్ వరుసగా మూడుసార్లు ఓటమి చెందిన వారికి ఈ దఫా సీటు ఇవ్వమని చెప్పిన సంగతి తెల్సిందే. ఈ నేపథ్యంలో చంద్రబాబు సర్వేపల్లి నుంచి సోమిరెడ్డిని తప్పించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే టీడీపీ తొలిజాబితాలో సర్వేపల్లి సీటు ప్రకటన చేయలేదనే ప్రచారం ఉంది. తాజాగా మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, లేదా పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి పేర్లతో ఐవీఆర్ఎస్ సర్వే చేయిస్తున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీనుంచి ఎవరు పోటీ చేసినా ఓటమి ఖాయమని సర్వేల్లో తేలడంతో కొత్త వ్యక్తులు కూడా అక్కడ నుంచి పోటీ చేసేందుకు జంకుతున్నారు.

**సోమిరెడ్డి భవితవ్యంపై నీలినీడలు**

టీడీపీలో సీనియర్ నేతగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉన్న సోమిరెడ్డి రాజకీయ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. పార్టీలో సీనియర్ నేతగా ఉండి సీటు కోసం అధిష్టానం వద్ద చేతులు కట్టుకునే పరిస్థితి వచ్చిందని ఆయన అనుచరుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. సర్వేపల్లిలో సీటు ఇవ్వకుంటే తనకంటూ నియోజకవర్గం లేకుండా పోతుందని, తన కుమారుడి రాజకీయ ఆరంగేట్రం కుదిరేలా లేదని లోలోన మదన పడుతున్నట్లు పార్టీ నేతలే చెపుతున్నారు. రాజకీయాల్లో ఎంతో అనుభవమున్న నేతగా చెప్పుకునే సోమిరెడ్డి చీప్ ట్రిక్స్ ప్లే చేయడంపై సొంత పార్టీలోనే చులకన అవుతున్నారు. నియోజకవర్గంలో కొందరు అమాయకులను పిలిపించుకుని పార్టీ కండువా కప్పుకుంటే చాలు ఇంత ప్యాకేజీ ఇస్తానంటూ బతిమాలుకోవడంపై ఆ పార్టీ నేతలే పెదవి విరుస్తున్నారు.

**కాకాణి సెటైర్లు..**

ప్రస్తుతం సోమిరెడ్డి ప్రత్యర్థిగా ఉన్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రపథాన నిలిపి శభాష్ అనిపించుకుంటున్నారు. సోమిరెడ్డి అవినీతి పాపాలను నిత్యం వల్లెవేస్తున్నారు. తాజాగా టీడీపీ తొలిజాబితాలో సోమిరెడ్డికి సీటు ఖరారు చేయకపోవడంపై మంత్రి స్పందించారు. సోమిరెడ్డే తనకు ప్రత్యర్థిగా ఉండాలని సీటు ఇవ్వకుంటే మేమే ధర్నా చేస్తామంటూ సెటైర్లు వేస్తున్నారు. ఆయన ప్రత్యర్థి అయితేనే అవినీతి పాపాలను కడిగేసేందుకు బావుంటుందని మంత్రి నవ్వుతూ వ్యాఖ్యానించారు.

# రాజీకి బొల్లినేని ససేమిరా

- నేతల బుజ్జగింపు యత్నాలు విఫలం
- రేపు ఉదయగిరిలో అనుచరులతో భేటీ
- కలవరపడుతున్న టీడీపీ అధిష్టానం

ఉదయగిరి: ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొల్లినేని రామారావును కాదని, చంద్రబాబు ఈసారి కాకర్ల సురేష్‌కు టికెట్ ప్రకటించడంతో పార్టీలో ఆరంభమైన మంటలు మూడ్రోజులు గడిచినా ఇంకా చల్లారలేదు. రోజురోజుకు తీవ్ర రూపం దాల్చుతూ టీడీపీలో వేడి పుట్టిస్తోంది. టీడీపీ తొలి జాబితాలో కాకర్ల సురేష్ పేరు ప్రకటించడంతో బొల్లినేని రామారావు అధినేత చంద్రబాబు వైఖరిని తప్పుబడుతూ 'ఉదయగిరిలో టీడీపీ ఎలా గెలుస్తుందో చూస్తాను' అంటూ హెచ్చరించి పార్టీ పెద్దలకు టచ్‌లో లేకుండా వెళ్లిపోయారు. చంద్రబాబు ఎంత ప్రయత్నించినా బొల్లినేని అందుబాటులోకి రాకపోవడంతో ఆయనను బుజ్జగించే ప్రయత్నం బీద రవిచంద్రకు అప్పగించారు. దీంతో ఆయన ఆదివారం హైదరాబాదులో ఉన్న బొల్లినేని నివాసానికి వెళ్లి మాట్లాడినా మెత్త బడలేదు. చంద్రబాబు నిర్వహించే టెలీకాన్ఫరెన్స్‌లో అయినా పాల్గొనాలని బీద కోరినా బొల్లినేని తిరస్కరించారు. పార్టీకి ఎంతో సేవ చేసిన నాకు తీవ్ర అన్యాయం చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారని తెలిసింది. సోమవారం కూడా బొల్లినేనితో మాట్లాడేందుకు పలువురు టీడీపీ పెద్దలతో పాటు చంద్రబాబు ప్రయత్నం చేసినా ఆయన అందుబాటులోకి రాలేదు. తీవ్ర మనస్తాపం చెందిన ఆయన సోమవారం ముంబాయి వెళ్లిపోయారు.

**రేపు బొల్లినేని కీలక సమావేశం**

టికెట్టు విషయంలో బొల్లినేనికి జరిగిన అన్యాయంపై రగిలిపోతున్న ఆయన అనుచరులు పార్టీతో తాడోపేడో తేల్చుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. ఈ మేరకు బొల్లినేనిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. అవసరమైతే పార్టీకి గుడ్‌బై చెప్పి తమ సత్తా ఏమిటో ఎన్నికల్లో చూపించాలని దృఢంగా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ అవకాశం ఇస్తే పార్టీ మారాలని కూడా ఆయన అనుచరులు బొల్లినేనిపై ఒత్తిడి తెస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఉదయగిరిలో బుధవారం బొల్లినేని తన అనుచరులతో కీలక సమావేశం నిర్వహిస్తారని సమాచారం. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు బొల్లినేని అనుచరులు చెబుతున్నారు. అయితే బొల్లినేని పార్టీ నుంచి వెళ్లిపోకుండా బుజ్జగించే నిమిత్తం చంద్రబాబు కొంతమంది పార్టీ జిల్లా పెద్దలకు బాధ్యత అప్పగించినట్లు తెలుస్తోంది. మరి వీరి ప్రయత్నాలు ఫలిస్తాయో లేదో మరో రెండ్రోజుల్లో స్పష్టం కానుంది.

# నలుగురు చైన్ స్నాచర్ల అరెస్ట్


మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

మర్రిపాడు: నలుగురు చైన్ స్నాచర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం మర్రిపాడు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆత్మకూరు సీఐ జి.వేణు వివరాలను వెల్లడించారు. ఈ నెల 22వ తేదీన మర్రిపాడు బస్టాండ్ సెంటర్‌లో టీ అంగడి పెట్టుకుని జీవనం సాగిస్తున్న లక్ష్మి అనే మహిళ మెడలో నుంచి నలుగురు వ్యక్తులు బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు ఎస్సై విశ్వనాథరెడ్డి తన సిబ్బందితో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం చుంచులూరు క్రాస్‌రోడ్డు వద్ద ఎస్సై తన సిబ్బందితో కలిసి నిందితులను పట్టుకున్నారు. రాజమండ్రికి చెందిన వారిపై 30కి పైగా కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి కారు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.







- స్నేహితుడితో కలిసి పథక రచన చేసిన భార్య
- ఆమె కళ్లెదుటే పైశాచికంగా హత్య చేసిన నిందితులు
- గుర్తుతెలియని వారు చంపారని బుకాయింపు
- రామచంద్రాపురంలో జరిగిన హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఏడుగురి అరెస్ట్

# 'నా భర్తను హత్య చేయండి'


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, చిత్రంలో ఇన్‌స్పెక్టర్, ఎస్సై

నెల్లూరు(క్రైమ్): 'నా భర్త నిద్ర పోయాడు. వచ్చి చంపేయండి' ఓ మహిళ తన స్నేహితుడికి పంపిన మెసేజ్ ఇది. ఇష్టం లేని వివాహం.. అయిష్టంగా కాపురం.. ఓ యువకుడి పరిచయం ఆమెలో కొత్త ఆశలను రేకెత్తించింది. ఈ విషయాన్ని పసిగట్టిన భర్త మందలించడంతో కోపంతో రగిలిపోయింది. స్నేహితుడితో కలిసి ఏకంగా భర్త హత్యకు పథక రచన చేసింది. నిందితులు ఆమె కళ్లెదుటే కిరాతకంగా హత్య చేస్తున్నా కనికరం చూపించలేదు.. గుర్తుతెలియని వారు హత్య చేశారని బుకాయించే ప్రయత్నం చేసినా పోలీసుల విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ఆమెతోపాటు మరో ఆరుగురిని అరెస్ట్ చేశారు. నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, నవాబుపేట ఇన్‌స్పెక్టర్ ఎం.బాబీతో కలిసి నిందితుల వివరాలను సోమవారం తన కార్యాలయంలో వెల్లడించారు. రామచంద్రాపురం రామాలయం వీధికి చెందిన ఎం. పెంచలప్రసాద్ (35)కు ముగ్గురు అక్కలున్నారు. పెద్ద అక్క ప్రసన్న కుమార్తె సుహితతో ఆరేళ్ల క్రితం ఆయనకు వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులున్నారు. ఈనెల 18వ తేదీ అర్ధరాత్రి 12 గంటల సమయంలో అతను తన ఇంట్లోనే దారుణ హత్యకు గురయ్యాడు.

**ఇదీ జరిగింది**

కుమారుడికి తమ మనవరాలైన సుహితతో వివాహం చేస్తే బంధాలు మరింత బలపడతాయని పెంచల ప్రసాద్ తల్లిదండ్రులు భావించారు. అయితే మేనమామను వివాహం చేసుకోవడం ఆమెకు ఇష్టం లేదు. పెద్దలను ఎదిరించలేక పెళ్లి చేసుకుంది. కొంత కాలానికే వారి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే తన భర్త స్నేహితుడైన అదే ప్రాంతానికి చెందిన పెంచల వరప్రసాద్ అలియాస్ వరతో సుహితకు పరిచయమైంది. ఇద్దరూ ఫోన్‌లో మాట్లాడుకునే వారు. ఈ విషయం తెలుసుకున్న పెంచల ప్రసాద్ వరను తీవ్రంగా మందలించాడు. అతనితో స్నేహం వద్దని భార్యను సైతం హెచ్చరించడంతో గొడవలు ఎక్కువయ్యాయి. దీంతో సుహిత, వర కలిసి పెంచల ప్రసాద్‌ను అడ్డు తొలగించుకోవాలని పథక రచన చేశారు.

**స్నేహితులతో కలిసి..**

పెంచల ప్రసాద్‌ను హత్య చేసేందుకు వర తన స్నేహితులైన ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన సాగర్, అల్లీపురానికి చెందిన వెంకటసాయి, రామచంద్రాపురానికి చెందిన మనోహర్ అలియాస్ మనో, వేలు లివింగ్‌స్టన్, నాగేంద్రబాబు, పెంచలయ్య అలియాస్ పవన్‌కుమార్, నిరీక్షణ్ సహకారం తీసుకున్నాడు. ఈనెల 18వ తేదీ రాత్రి పెంచల ప్రసాద్ నిద్రపోయిన తర్వాత తలుపునకు గడియ పెట్టలేదని వచ్చి చంపాలని సుహిత తన స్నేహితుడికి తెలియజేసింది. అనుకున్న ప్రకారం వర అతని స్నేహితులు ఇంట్లోకి ప్రవేశించి పెంచల ప్రసాద్‌ను అతి పాశవికంగా హత్య చేశారు. అతని సెల్‌ఫోన్ తీసుకుని పరారయ్యారు. డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి సుహితను ప్రశ్నించగా గుర్తుతెలియని వ్యక్తులు తన నోట్లో గుడ్డలు కుక్కి హత్య చేశారని, చీకట్లో వారి ముఖాలను సరిగ్గా చూడలేదని చెప్పింది. ఆమె ప్రవర్తనపై పోలీసులకు అనుమానం కలిగింది. అదే సమయంలో మృతుడి రెండో అక్క లక్ష్మి అదే రోజు రాత్రి తాము ఊరి నుంచి వస్తుండగా పెంచల ప్రసాద్ ఇంటి నుంచి వర తోపాటు మరికొందరు బయటకు పరుగెత్తుకుంటూ వచ్చారని పోలీసులకు వెల్లడించింది. దీంతో ఆ దిశగా విచారణ చేపట్టారు. ఈనెల 25వ తేదీ రాత్రి ఎస్వీజీఎస్ కళాశాల గ్రౌండ్ వద్ద వర, సాగర్, వెంకటసాయి, మనోహర్, లివింగ్‌స్టన్, నాగేంద్రబాబును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి విచారించగా అన్ని విషయాలు వెలుగు చూశాయి. వారిని అరెస్ట్ చేసి హత్యకు వినియోగించిన కత్తులు, ఇంకా సెల్‌ఫోన్లు, బైక్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సుహితను సైతం అరెస్ట్ చేశారు. ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని వారిని త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్సై రెహమాన్, సిబ్బంది పాల్గొన్నారు.

## భూ పట్టాలిస్తుంటే టీడీపీకి కడుపు మంట

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


పట్టాలు పొందిన లబ్ధిదారులతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: 'గ్రామాల్లో పేదలు సాగుచేసుకుంటున్న భూములను గుర్తించి వారికే అసైన్‌మెంట్ పట్టాలను ఈ ప్రభుత్వం అందిస్తోంది. చుక్కల భూముల సమస్యలు, 20 ఏళ్లగా సాగుచేసుకుంటున్న అసైన్‌మెంట్ భూములకు శాశ్వత హక్కు కల్పించడం ఏ రాష్ట్రంలో అమలు చేయలేదు. దీంతో ఇక ప్రజలు తమను పట్టించుకోరని తెలుగుదేశం పార్టీ నేతల కడుపు మండిపోతోంది' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పులికల్లు గ్రామంలో సోమవారం 96 మంది లబ్ధిదారులకు 124 ఎకరాల అసైన్‌మెంట్ భూపట్టాలు, 137 మంది లబ్ధిదారులకు ఇంటి నివేశనా స్థలం పట్టాలను మంత్రి అందజేశారు. ముందుగా రూ.21.50 లక్షలతో నిర్మించిన సైడ్ డ్రెయిన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కాకాణి మాట్లాడుతూ పులికల్లు పంచాయతీలో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, ఎస్సీకాలనీలో రూ.25 లక్షలతో కమ్యూనిటీ హాలు, వెంకటాపురంలో మాతమ్మగుడి నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రాజకీయాల్లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి లాంటి అవకాశవాది, చంద్రబాబు లాంటి దగాకోరు ఎక్కడా ఉండరన్నారు. రైతులకు ధాన్యం ధరలు 20 శాతం అదనంగా అభిస్తుంటే సోమిరెడ్డి ఒళ్లంతా మండిపోతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, సర్పంచ్ జీవీ సుబ్బమ్మ, ఉప సర్పంచ్ ఎ.చంద్రశేఖర్, జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్ కుమార్‌రెడ్డి, నాయకులు ఎనిమిరెడ్డి పెంచలరెడ్డి, గొడ్డేటి నారాయణరెడ్డి, కోడూరు జనార్దనరెడ్డి, ఎస్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ హయాంలోనే రూరల్ అభివృద్ధి

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి


సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎంపీ ఆదాల

నెల్లూరు రూరల్: 'నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ హయాంలోనే అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరిగింది' అని నెల్లూరు ఎంపీ, ఆ పార్టీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూరల్ మండలంలోని సజ్జాపురంలో నూతన సచివాలయ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని ప్రజలు ఆదరించాల్సిందిగా కోరారు. రూరల్ నియోజకవకర్గ అభివృద్ధికి రూ.కోట్లు నిధులను ప్రభుత్వం నుంచి తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 156
లేయర్ (లైవ్): 75
బ్రాయిలర్ చికెన్: 270
బ్రాయిలర్ స్కిన్‌లెస్: 300
లేయర్ చికెన్: 127

## 29న జాబ్‌మేళా

నెల్లూరు(టౌన్): డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఈనెల 29వ తేదీన జాబ్‌మేళా జరుగుతుందని ప్రిన్సిపల్ గిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీసిటీకి చెందిన 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. డిగ్రీ ఫైనలియర్ చదువుతూ సీఈజేపీలో రిజిస్టర్ అయిన విద్యార్థులు అర్హులన్నారు. వివరాలకు 90306 65477 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.75
సన్నవి : రూ.60
పండ్లు : రూ.22

## ఎన్నికల్లో గెలుపు కోసం చంద్రబాబు కుట్రలు

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: ఎన్నికల్లో గెలిచేందుకు చంద్రబాబు నాయుడు.. పవన్ కళ్యాణ్‌తో కలిసి కుట్రలకు తెర లేపాడని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను కోవూరు తాలూకా ప్రాంగణంలో సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కుటుంబం 1961 నుంచి రాజకీయాల్లో ఉందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంటి సీఎంను చూడలేదన్నారు. ఆయన ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను అమలు చేసి పేదలను ఆదుకున్నట్లు చెప్పారు. ఇలాంటి వ్యక్తిని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మీకు లబ్ధి జరిగి ఉంటే ఓటు వేయాలని చెప్పిన అరుదైన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని చెప్పారు. చంద్రబాబును ఎవరూ నమ్మొద్దని కోరారు. కార్యక్రమంలో డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ ప్రభుత్వానికి జై కొట్టండి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పిలుపు


మాట్లాడుతున్న విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు రూరల్: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. వచ్చే ఎన్నికల్లోనూ ఆయనకు జై కొట్టాలి' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని పమిడిపాడు, నబ్బీనగరం, మురగళ్ల గ్రామాల్లో సోమవారం విజయీభవ యాత్ర జరిగింది. ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో జన్మభూమి కమిటీలు పెట్టి ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర చంద్రబాబుది. ఆయన పాలన కావాలో, విలువలకు కట్టుబడి సువర్ణాక్షరాలతో లిఖించదగిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కావాలో లబ్ధిదారులు నిర్ణయించుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి, బోయలచిరివెళ్ల, పమిడిపాడు, మురగళ్ల సర్పంచ్‌లు బొలిగర్ల వెంకటేశ్వర్లు, సతీష్ నాయుడు, పువ్వాడి హరిత, ఆరవేడు సర్పంచ్ సూరం ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.